# మాయింటి రామాయణం

## భమిడి వెంకటేశ్వర్లు

రాత్రి పదకొండు గంటలు కొట్టింది, గోడ గడియారం

కాలింగ్ బెల్ శబ్దంతో వెంటనే మెలకువ వచ్చింది అనూరాధని లేపి, తలుపు తీయమన్నాను నాకు లేచేందుకు బద్ధకంగా వుంది తనకు అసలు నా మాట వినబడలేదులా వుంది

కాలింగ్ బెల్ మళ్ళీ మోగింది

నేను లేచి తలుపు తీసాను

ఎదురుగా అమ్మా! నాన్న! వాళ్ళ చేతుల్లో రెండు సూట్‌కేసులు వున్నాయి ఎక్కడనుంచి వస్తున్నట్లు? ఊరు వెడుతూ, నాతో చెప్పేందుకు వచ్చారేమో? అయితే మాత్రం యీ సమయంలో వస్తారా? వారం రోజుల క్రితం మల్కాజిగిరి వాళ్ళింటికి వెళ్ళివచ్చానే? ఆ తర్వాత జరిగిన విషయాలు నాకేమీ తెలియవు

మా పెద్దబావగాని, సోమేశంగాని ఈమధ్య ఫోను చేయడంలేదు

అమ్మ, నాన్న లోపలకు వచ్చి సోఫామీద కూర్చున్నారు ఇంతలో అనూరాధ లేచింది అమ్మ నాన్నతో కళ్ళతో ఏదో "వద్దు" అన్నట్లు సౌజ్ఞ చేయడం గమనించాను

"భోజనం చేసారా? అక్కడంతా బాగున్నారా? ఏమిటి, ఇంత రాత్రిపూట" అడుగుతోంది అనూరాధ

అన్నింటికి వాళ్ళు మౌనంగా తలూపారు

"అక్కడేదో గొడవయి వుంటుంది అందుకే ఇలా వచ్చేరు ఇప్పుడు కదిలిస్తే తీగంతా కదులుతుంది చుట్టుపక్కలవారికి నిద్రలుండవు నాన్న కోపం, ఆవేశం తెలిసిందే? ఆ కోపంతో ఏడు తరాల వాళ్ళందరూ బతికొస్తారు తెల్లారేక ఎటూ తెలుస్తుంది" అనుకొన్నాను

పావుగంట తర్వాత, అనూరాధ యిద్దరికీ వడ్డించింది ఈ లోపల మడతమంచాలు వేసి పక్కలు సిద్ధం చేసాను

వాళ్ళు పడుకొనేసరికి గోడ గడియారం పన్నెండు గంటలు కొట్టింది

పడుకున్నానన్న మాటేగాని, నిద్ర రావటం లేదు ఏవో ఆలోచనలు జ్ఞాపకాలు తెరలు తెరలుగా గుర్తుకు రాసాగాయి

*　　　*　　　*

ముప్ఫై అయిదేళ్ళ వయసులో, పదహారేళ్ళ ఉద్యోగ అనుభవం వుంది పదకొండేళ్ళ క్రితం అనూరాధతో పెళ్ళయితే, ఇద్దరు కూతుళ్ళకు తండ్రి ననిపించుకొన్నాను

నాన్న తరచు అంటుంటాడు, "ఎంతసేపూ పనికిరాని ఆ పత్రికలు చదవకపోతే, డిపార్ట్‌మెంటల్ పరీక్షల కోసం పుస్తకాలు చదవకూడదురా? పోనీ ఎక్కడైనా "పార్ట్‌టైం" వేయకూడదూ? ఎం కాం ఎందుకు చదివినట్లు? ఇలా అయితే రేపు యిద్దరు కూతుళ్ళకు వేల కట్నం యిచ్చి పెళ్ళిళ్ళు ఎలా చేస్తావ్?" అని ఆయన మాటల్లో ముగ్గురు కూతుళ్ళకు తను పడ్డ శ్రమ కష్టం కనిపించింది

గౌరవంగా ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ, జీతం చాలటం లేదని, అర్హతలున్నాయని, మన అవసరాలు తీర్చుకునేందుకు — మరో విధంగా సంపాదించి ప్రభుత్వాన్ని మోసం చేయడం నా కిష్టం వుండదు

పదేళ్ళ క్రితం, నాన్న నాకోరికమీద హైదరాబాదు ట్రాన్స్‌ఫరు చేయించుకొన్నాడు

నాకు ఇద్దరు తమ్ముళ్ళు — సోమేశం, రామేశం

ముగ్గురు చెల్లెళ్ళు — పెద్దదానికి మాత్రం పెళ్ళి అయింది

సోమేశం ఢిల్లీలో పనిచేస్తున్నాడు వాడికి ఇద్దరు కొడుకులు

విజయవాడ అంటే నాకు వల్లమాలిన అభిమానం అక్కడ నేను ఎస్సెల్సీ, పియుసి, బికాం చదివాను డిగ్రీ చేతికి రాకుండానే, గుమాస్తాగా ఉద్యోగం వచ్చింది అక్కడ నాలుగేళ్ళు పనిచేసాక, యుడిసిగా ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగం వస్తే, హైదరాబాదు చేరాను

అంతా కలిసే వుంటున్నాము నాన్న తరచు క్యాంపుల్లో తిరగటంవల్ల, ఇంటి బాధ్యత నామీదే పడింది ఉమ్మడి కుటుంబంలో ఖర్చు బాగానే అయేది అమ్మ దగ్గర, డబ్బు అవసరమయితే తీసుకోమని నాన్న చెప్పటం, తీరా అమ్మని అడిగితే "నా దగ్గరేం వుందిరా నీకే యిచ్చారుగా మీ నాన్న!" అనేది

ఆ మాటల్లోని అర్థం అప్పట్లో తెలిసేది కాదు

మరో ఆరునెలలకు, సోమేశం కూడ హైదరాబాదు ట్రాన్స్‌ఫరై వచ్చాడు వాడినికూడా తనతోపాటే వుండమన్నారు, అమ్మ—నాన్న!

వాడు తనవాటా కింద వందరూపాయలిచ్చేవాడు నాన్న మూడొందలు నా వాటా కింద జీతం అంతా అయేది

క్యాంపునుంచి రాగానే యింటి ఖర్చుల గురించి అడిగేవాడు "ఇంత అయింది" అని చెప్పలేకపోయే వాడిని

నాన్నతో అయిన ఖర్చు గురించి చెప్పలేక, ప్రావిడెంటు ఫండు నుంచి అప్పు తీసుకొనేవాడిని

అందరూ ఏవో కబుర్లు చెప్పుకొనేవారు నేను చూస్తుంటే ఆపేసేవారు ఎందుకోమరి? అర్థమయేది కాదు

రామేశానికి ఎందుకో చదువు అబ్బలేదు దానికి కారణం నాన్నే అని చెప్పాలి అమ్మ వాడిని గారాబం చేసేది జీతం తెచ్చి నాన్న వాడి చేతిలో పెట్టేవాడు వాడు ఇంటిఖర్చులకు మూడొందలు నా ముఖాన పారేసేవాడు ఓ వంద దగ్గరుంచుకొనేవాడు మిగిలినదంతా సేవింగ్సు, రికరింగు అకౌంట్లులో



వేసేవాడు ఏడ్చి మొత్తుకున్నా ఒక్కరూపాయి యిచ్చేవాడుకాదు చిన్నప్పట్నుంచీ "పొదుపు" చేయ డానికి అలవాటు పడటంతో చదువుపట్ల నిర్లక్ష్యం పెరిగింది ఇంటరు రెండుసార్లు తప్పాడు

అప్పుడప్పుడు నాకనిపించేది, "ఈ దేశానికి వీడు కనుక ఆర్థికమంత్రి అయితే ఉద్యోగులకు జీతాలు చచ్చినా పెంచడు" అని

* * *

ఎందుకో, నాకు ఇంటిస్థలం కొనాలని ఇల్లు కట్టాలని అనిపించేది స్థలంకోసం దిల్‌షుక్‌నగరు వైపు దాదాపు రెండేళ్ళు ప్రయత్నించేను ధర కుదరక అమ్మేవాళ్ళు కలవక ఇతర కారణాలవల్ల, నా వుద్దేశం నెరవేరలేదు

ఇలావుండగా ఓరోజు ఆఫీసు హౌసింగుసొసైటీ వాళ్ళు ప్రస్తుతం కాకతీయ నగరుగా పిలువబడు తున్న ప్రాంతాన్ని, స్థలాలుగావేసి అమ్ముతున్నట్లుగా ప్రకటించారు

నాన్నను ఓరోజు స్థలం చూపించేందుకు తీసుకు వెళ్ళాను

"ఇదంతా రేగితోట ముళ్ళూ! ఇక్కడ కొనటం దండగ! అగ్గిపెట్టె కావాలంటే ఆమడ దూరం వెళ్ళాలి అర్ధరాత్రి ఎవరైనా రోడ్డుమీద గొంతుపిసికి పారిపోయినా దిక్కుండదు " చెప్పాడు

ఈరోజు ఆ కాలనీచూస్తే ఎంతో బాధ కలుగు తుంది

ఆ తరువాత ఆఫీసులోనే సుబ్బారావు అనే ఆయన, మెహదీపట్నం బస్‌డిపో దగ్గర ఇళ్ళస్థలాలు అమ్ముతున్నట్లు తెలిసింది వెంటనే చూసేందుకు బయలుదేరి, వెయ్యిరూపాయలు అడ్వాన్సుగా కట్టేసేను

ఈసారి స్థలం చూపించేందుకు ఎవరినీ తీసు కెళ్ళలేదు, ఇదివరకటి అనుభవం హెచ్చరించటం వలన

స్థలం కొనేందుకు నాన్న ఆరువేలు అప్పుగా యిచ్చేడు ఆఫీసుద్వారా ఇంటి నిర్మాణానికి పాతికవేలు అప్పు దొరికింది మరో పదివేలు స్నేహితులదగ్గర స్వంతపరపతి ఉపయోగించి వున్నంతలో ఓమోస్తరు సౌకర్యాలతో ఇల్లు కట్టేను నాలుగు నెలలకోసారి ప్రావిడెంట్‌ఫండు, బ్యాంకునుంచి తీరిన బాకీని తిరగ తోడుతూ ఇంటిమీద పెట్టవలసివచ్చింది, ఆఫీసువారికి "కంప్లీషన్ రిపోర్టు" యివ్వకపోతే జీతంలో కొంత భాగం నిలుపుదలచేసే ప్రమాదం వుండటంవల్ల!

* * *

మరో సంవత్సరం గడిచింది

ఆఫీసులో కోపరేటివ్ బ్యాంకు ఇంటి అవసరాలు సమకూర్చుకొనేందుకు, "పర్చేజ్ అడ్వాన్సు" పథకం ప్రవేశపెట్టింది అందులో డబ్బు తీసుకొని కుక్కరు, సోఫా, కుట్టుమిషను, స్టీలుసామగ్రి కొనటం జరిగింది

ఆ సామానులు యింట్లోవారికి అనుమానం కలిగించాయి ఉమ్మడి కుటుంబ ఖర్చుల్లో మిగుల్చు కొని, అవన్నీ కొన్నానన్న అభియోగం ఓ రోజు బయటపడింది

ఇంటి సంగతులేవీ నాన్నకు తెలిసేదికాదు

# మా ఇంటి రామాయణం

చెప్పినా పట్టించుకొనేవాడు కాదు

ఆ మాటలు నా మనసును ఎంతో గాయ పరిచాయి

"మనస్పర్థలు రాకముందే ఎవరి ఖర్చులు వారు విడిగా పెట్టుకొంటే మంచిది లేదా ఇంటి బాధ్యత రామేశంగాని, సోమేశంగాని తీసుకొంటే తెలుస్తుంది లేకపోతే సోమేశాన్ని వేరే యిల్లు తీసుకోమని, అక్కడే అంతా వుండండి బాగుంటుంది" అన్నాను

ఎంతో బాధతో, ఆ మాటలు అనవలసి వచ్చింది

కాలం మారకపోయినా, మనుషులు — వారి మనస్తత్వాలు ఎలా మారుతుంటాయో, ఆ సంఘటన ద్వారా తెలిసింది

నాన్నతో ఈ విషయం చెప్తే, ఎంతో బాధ పడ్డాడు

సోమేశంతో మల్కాజిగిరిలో ఇల్లు చూడమని, తను వచ్చేసరికి మకాం అక్కడకు మార్చివుండాలని హెచ్చరించి నాన్న క్యాంపుకు వెళ్ళిపోయేడు

* * *

వేరింటి కాపురంలో సోమేశం భార్య, అమ్మా తరచు ఘర్షణ పడేవారు అత్తా కోడళ్ళ మధ్య తగవులు, గొడవలు యీనాటివి కాదు కదా? అయితే ప్రస్తుతం చదువుకొన్న కోడళ్ళు ఆ సాంప్రదాయాన్ని మరింత స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం ఉపయోగించుకొంటున్నారు

కాలం ఎవరి ప్రమేయం లేకుండానే గడుస్తుంది

అమ్మ రెండో కోడలు దగ్గర ఆరు నెలల కంటే ఎక్కువ కాలం వుండలేకపోయింది

ఈసారి నాన్న విసుగుచెంది, వేరే యిల్లు చూసి, మకాం మార్చేసేడు కుటుంబ బాధ్యత, ఖర్చులు రామేశం వహించాడు వాడి ధాటికి ఎదురు లేకుండాపోయింది

* * *

మాకు విజయవాడలోను, స్వగ్రామంలోను రెండు యిళ్ళు వున్నాయి స్వగ్రామంలోని ఇల్లు మా బాబాయి కొనబోతున్నట్లుగా ఎవరిద్వారానో తెలిసింది ఆ విషయాన్ని అమ్మా—నాన్న ఎందుకో గోప్యంగా వుంచారు

ఓ రోజు వాళ్ళని చూసేందుకు వెడితే, ఇంటి దస్తావేజులమీద సంతకం చేయమని నా ముందర వుంచాడు కారణం అడగకుండానే సంతకంచేసి యిచ్చి వేసాను

ఆ డబ్బుతో రెండో చెల్లెలి వివాహం జరిగింది

ఒకసారి పిల్లల స్కూలు ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం వగైరా ఖర్చులకోసం మూడొందలు అవసరం వచ్చి నాన్నను అడిగేందుకు వెళ్ళాను

కాని ఆ రోజు నాన్న క్యాంపునుంచి రాలేదు

వచ్చిన విషయంగురించి అమ్మతో చెప్పాను ఆవిడపేర కూడా బ్యాంకులో డబ్బు వుంది

"ఎప్పుడూ నీకు డబ్బుగురించేనే ఆలోచన? ఇక్కడేమైనా డబ్బురాశులు పెట్టుకొని కూర్చు న్నామా ?" అన్నాడు రామేశం

అమ్మకూడా వాడినే సమర్థించింది

డబ్బు అవసరమైతే, నాన్నని కాకపోతే ఎవరిని అడగాలి? నేను వారి కొడుకునుకానా? నాకామాత్రం హక్కులేదా? వాడెందుకలా అన్నాడో తెలియలేదు

"ఇంటికోసం యిచ్చిన ఆరువేలు యివ్వలేదని కోకు అయినా నీ సంపాదన ఏమీ అడగలేదు కదా?" అన్నాను కోపంతో

"అవన్నీ యిప్పుడెందుకురా! ఇస్తే యివ్వచ్చు నిన్ననే రెండువందలు తెచ్చాను ఇంకోవంద వుంటుం దేమో" అంది అమ్మ

విజయవాడలో నేను నాలుగేళ్ళు పనిచేసినప్పుడు జీతం అంతా అమ్మ చేతిలోనే పెట్టేవాడిని నా కారణంగానే సోమేశం వాల్తేరులో ఎం ఏ చదివాడు అప్పటికింకా పెద్దచెల్లెలుకు పెళ్ళికాలేదు నా జీతంలోంచి వేరే మిగుల్చుకొన్నదేదీలేదు వంట గ్యాసు కొనేందుకు డబ్బుకోసం నాన్నకు రాస్తే,

"వంటగ్యాసు చాలా ప్రమాదం గ్యాసువల్ల ఎన్నో యిబ్బందులున్నాయి, నేనందుకు యిష్ట పడను "అంటూ అమ్మ ఉత్తరం రాయించింది

అయితే నా సరదాని ఓ స్నేహితుడు తీర్చాడు

నన్ను వాళ్ళు అయిదువేల కట్నానికి అమ్ము న్నప్పుడు, మిగిలిన డబ్బుతో విజయవాడలో యిల్లు కొనేందుకుపయోగించారు వాళ్ళు కాని సోమేశం విషయంలో మరోలా ఎందుకు ప్రవర్తించేరు?

వాడి వివాహం ద్వారా ఎనిమిదివేలు కట్నం వచ్చింది ఖర్చులు పోగా మిగిలిన డబ్బు మూడ వేలు అమ్మ వాడిపేరున బ్యాంకులో వేయించింది ఇంటి సామానులు, వంట సామాగ్రి వాడికి సమకూర్చారు

నాకేం యివ్వారని? ఇవన్నీ అమ్మకు గుర్తు చేయనవసరం లేదు ఒక తల్లి కన్న సంతానంపట్ల, ఎందుకిన్ని తేడాలు?

ఎప్పుడైనా అనూరాధ ఆ ప్రస్తావన తెస్తే "వాళ్ళు ఏమీ యివ్వలేదని మనం బాధపడకూడదు ఎవరికెంత ప్రాప్తో, అంతే లభిస్తుంది" అంటూండే వాడిని

ఒకరి పెట్టుపోతలపై ఆధారపడటం ఎందుకో నాకు యిష్టంలేదు

నేను వచ్చిన విషయం నాన్నకు తెలిసి, ఆఫీసుకు ఓ రోజు వచ్చి "ఈ వెయ్యి రూపాయలు దగ్గ రుంచుకో! ఇంట్లో ఎప్పుడూ డబ్బు అడక్కు!" అంటూ చెప్పాడు

* * *

నేను ఇల్లు కట్టేనని అందరికీ ఈర్ష్యగా వుండేది మొదట్లో అందరూ "హైదరాబాదులో ఇల్లు ఎందుకురా ?" అన్నవారే!

సోమేశం ఆఫీసు సొసైటీ ద్వారా ఇంటి స్థలం కొన్నాడు పెద్దబావచేత కూడా కొనిపించాడు

మరో నాలుగు నెలలకు, నాన్న రామేశం పేరున పన్నెండువేలు పెట్టి స్థలం కొన్నాడు

"వాడికి చదువులేదు మీ కంటే చిన్న ఉద్యోగి ఈ స్థలం వాడి పేరున కొన్నందుకు మీరేమీ బాధపడకూడదు" అన్నాడు నాన్న ఓసారి

ఈ స్థలం కొన్న నెలకు, ఆ విషయం నాతో చెప్పేరు

వారానికోసారయినా నేను మల్కాజిగిరి వెళ్ళి వాడిని కాని తరచు అలా వెళ్ళటం వలన నన్నెంత తేలికగా చూడబడేవాడినో గ్రహించలేకపోయాను

అయినా వెదుతూ వుండేవాడిని !

విజయవాడలో ఇల్లుపాతికవేలకు అమ్మేసినట్లు, దస్తావేజులమీద సోమేశం నా సంతకం చేసేసినట్లు తర్వాత తెలిసిన విషయం

''ఇది నిజమేనా ?'' అని అడిగితే, తలూపాడు వాడు

తను అమ్మాలనుకొంటున్న విషయం, ఓసారి ఎప్పుడో నాన్న చెప్పినట్టు గుర్తుంది దస్తావేజు కాగితాలు నా దగ్గరికి రాకపోయేసరికి, ఆ బేరం యింకా తేలలేదనుకొన్నాను

ఇంటి పెద్దకొడుకుగా నా పరిస్థితి అది !

* * *

''రేపు అయిదో తారీఖున నువ్వు శంకుస్థాపన చేసేందుకు రావాలి'' చెప్పాడు నాన్న ఓ రోజు ఆఫీసుకు వచ్చి

రామేశానికి ఉపనయనం కాలేదు తాతగారు పోయి ఏడాది కాలేదు కాబట్టి, అమ్మా – నాన్న పీటలమీద కూర్చోకూడదుట సోమేశం చేత చేయించడం అమ్మకు ఇష్టం లేదుట

పై కారణాల దృష్ట్యా అనూరాధ, నేను పీటలమీద కూర్చుని ఆ కార్యక్రమం పూర్తిచేశాం

కొద్దిగానైనా అమ్మకు మామీద సదభిప్రాయం వున్నందుకు నాకెంతో సంతోషంగా వుంది

మరో నెల తరువాత ఇంటి నిర్మాణం ప్రారంభమయింది

''ఆస్‌బెస్టాస్ రేకులతో, మూడు గదులు అవుట్ హవుస్‌లా వేద్దామనుకొంటున్నారు మీ నాన్న '' అమ్మ చెప్పింది

రామేశానికి ఆఫీసు ద్వారా లోను వచ్చాక కట్టుకుంటాడని, మాకు యీ మూడు గదులు చాలని ఆవిడ ఉద్దేశం

నెల తరువాత, కట్టుబడి ఎంతవరకూ వచ్చిందో చూద్దామని స్థలం దగ్గరికి వెళ్ళాను

ఆశ్చర్యం ! అందులో ఆరు గదులకు పునాది వేయబడివుంది అమ్మ నాతో అలా ఎందుకు చెప్పింది ? రామేశానికిగాని, సోమేశానికిగాని నాకీ విషయం చెప్పేందుకు యిష్టం లేదేమో ?

ఇంట్లో నాన్న పెత్తనం ఏమీలేదని మరోసారి బుజువయింది

రామేశానికి ఎంతో ముందుచూపు జాగ్రత్త తన సంసారానికి కావలసిన వస్తువులు, సామగ్రి అంతా ఏర్పరచుకొంటున్నాడు తనకేమీ, వచ్చిన జీతం యివ్వడని నాన్న అంటుంటాడు లప్పట్లో నాకెందుకు అటువంటి ఆలోచన కలగలేదో మరి ? ఇప్పట్నుంచే వాడిలో ''నాది'' అన్న భావం ఏర్పడటం, నాకెంతో సంతోషాన్ని కలిగిస్తుంది

ఇంటి నిర్మాణం చురుకుగానే సాగుతోంది ఇంటికప్పు వేసేందుకు బ్లాకులో సిమెంటు వంద బస్తాలు కొన్నాడు నాన్న ! అవినీతిని, చీకటి బజారుని విమర్శించే నాన్న యిలా 'చీకట్లో' కొనటం ఆశ్చర్యాన్ని కలిగించింది

మూడో చెల్లెలు వివాహం విషయం రామేశం తీవ్రంగా ప్రయత్నించేవాడు మాకు గోత్రం, శాఖల పట్టింపులేదు తనకు పెళ్ళిచేసి పంపేస్తే, నాన్నకు

# మా ఇంటి రామాయణం

మరీ చీకూ చింత, బరువు బాధ్యతలుండవని వాడి ఆలోచన ఏమో ?

అదీ నిజమే మరి ! హర్షించదగిన విషయం కాదా ?

మా అత్తయ్య (నాన్న చెల్లెలు)కు ఒక్కడే కొడుకు అతన్ని రెండో చెల్లెలు కోసం అడిగేం కాని వాళ్ళు అంగీకరించలేదు మూడోదానిని చేసుకోవాలను కొంటున్నారుట కాని అమ్మకు యిష్టం లేదు

కారణం అతను నిరుద్యోగి కావటమే !

నాన్న కోరిక నెరవేరేలా కనబడలేదు

* * *

జనవరి నెలలో నాన్న రిటైరవడం, రామేశం స్నేహితుల ద్వారా పోస్టల్ అకౌంట్సులో పనిచేసే ఓ కుర్రాడిని వరుడిగా ఎంచటం, పదివేల కట్నంతో అతను మూడో చెల్లెలుకు భర్త కావడం – అంతా కాకతాళీయంగా ఓ నెలరోజుల్లో జరిగిపోయింది

వివాహం మా యింట్లో జరిగింది రామేశం యింట్లో చేసేందుకు వీలుపడలేదు – కరెంటు, నీటి సౌకర్యం లేకపోవటంవల్ల, మగపెళ్ళివారు మా యింట్లో చేయమని కోరటంవల్ల

పేరుకు ఇల్లు రామేశంది శంకుస్థాపన, గృహప్రవేశం నేను, అనూరాధ చేశాం నాన్న అరవైవేల దాకా ఖర్చు చేసాడు అమ్మ మాత్రం ఇల్లు ''మాది'' అంటుంది ఇది ఎలా దారి తీస్తుందో మరి ?

పెళ్ళికి దాదాపుగా ఇరవైవేలు ఖర్చు అయిందట !

ఈ విషయమే వో రోజు అమ్మతో ప్రస్తావించాను

''విజయవాడలో ఇల్లు అమ్మేస్తే, మూడోదాని పెళ్ళి అయింది'' అని అయితే ఇంటిమీద పెట్టుబడి ఎక్కడిది ! ఇలా అడిగినందుకు అందరూ కలిసి నానా విధాలుగా అక్షింతలు వేశారు నిజంగా అది వూహించని సంఘటన మలుపు !

నాన్న మాట తీరులో కూడా మార్పు కనిపించేసరికి, నాకెంతో ఆశ్చర్యం కలిగింది ఆ యింట్లో నాన్న పెద్దకూతురు, సోమేశం కుటుంబాలని పెట్టుకొన్నాడు ఆ విధంగా వారికి బయట ఇచ్చుకోవలసిన అద్దె మాటఏభైరూపాయలదాకా మిగులుతుందన్నమాట !

నాన్నమాటవరసకు నాతో కూడా చెప్పాడు కాని నా సంగతి అందరికీ తెలిసిందే ! రాజకీయంలా మాట్లాడేవారికి దూరంగా వుంటేనే మంచిదని నా వుద్దేశం !

* * *

ఓరోజు పెద్దబావ ఫోనుచేసాడు

''రామేశానికి పెళ్ళిట తనని, సోమేశాన్ని యిల్లు ఖాళీచేయమని చెప్పాట్ట ! నాన్న అమ్మ యీ విషయంలో ఏమీ అనలేదుట!'' అని

రామేశానికి, మా అత్తయ్యకూతురు రాజేశ్వరి నివ్వాలని ఎప్పుడో నిర్ణయమయింది వాడు కూడ తనంటే సరదాపడేవాడు నాన్న మాత్రం చెల్లెలు కొడుక్కి కూతురు నివ్వకపోయినా వాళ్ళకూతురిని మూడోకోడలుగా చేసుకోవాలని ఎంతో వుబలాటపడేవాడు! మొదటి, రెండో కోడళ్ళు తమంటే యిష్టపడరుట తెలిసినవారు బంధువులు అయితే గౌరవిస్తారట, చెల్లెలు కూతురయితే కళ్ళకద్దుకొని పూజిస్తుందట అన్నయ్య, వదినలంటే తన చెల్లెలుకు ఎంతో అభిమానం, ప్రేమట !

ఈమధ్య వాళ్ళింటికెళ్ళటం తగ్గించాను వారి మాటల్లో హేళన అపహాస్యం తేలికభావం కనబడేది దూరంగావుంటే మంచిదనిపించింది అతి కొద్దికాలంలోనే ఎన్నోమార్పులు

* * *

రామేశానికి, రాజేశ్వరికి పెళ్ళయిపోయింది

కాని కట్నంతీసుకోకుండానే నాన్న తనముద్దుల మూడో కోడలుని తెచ్చుకున్నాడు పెళ్ళివిషయం రామేశం నాతో చెప్పనేలేదు

అమ్మ, నాన్నమాత్రం శుభలేఖ యిచ్చి రెండు నిముషాలు కూర్చుని వెళ్ళారు ఆఫీసులో సెలవు దొరక్కపోవటంతో, మేమెవరం పెళ్ళికి వెళ్ళలేకపోయాం ! పెళ్ళయ్యాక మా అత్తయ్య కూతురుని దిగబెట్టేందుకు హైదరాబాదు వచ్చింది మా యింటికి చుట్టం చూపుగా వచ్చింది ఓ రోజు !

''ఏరా ! నీ తమ్ముడు పెళ్ళికి రాలేదూ ?'' అని ప్రశ్నించింది ఆవిడ

నేనేమీ చెప్పలేకపోయాను ఆ పూట మా యింట్లో భోజనంచేసి అత్తయ్య వెళ్ళిపోయింది

అప్పుడప్పుడు కొందరు అడిగేవారు ''ఆ యిల్లు మీ తమ్ముడికేనా ? లేక మీ ముగ్గురికీనా ?'' అని

''నాకుమాత్రం అందులో భాగం వుండదు'' అని చెప్పేవాడిని సోమేశానికి ''వుండవచ్చునని'' నా అభిప్రాయం

నాన్న మాత్రం తరచు అనేవాడు ''ఈ యిల్లు అమ్మేసి, వాడికి ఓ చిన్న యిల్లు కొంటాను ముగ్గురికీ తలో పాతికవేలు యివ్వాలనుకొంటున్నాను నా కెటూ ఏడు వందలు పెన్షను వస్తుంది ఏ కొడుకు దగ్గరున్నా మాకు వెళ్ళిపోతుంది '' అని అవి కొత్తగా వుండేవి

రామేశం ఒప్పుకొంటాడా ? ఆ యింట్లో సీలింగు ఫాన్లు, ట్యూబులైట్లు, మరికొన్ని అలంకారాలు ఏర్పరచినవాడు, నాన్న కోరికని తీరుస్తాడా ?

రాజేశ్వరి కాపురానికి వచ్చాకకూడ, నాన్న నాలుగయిదుసార్లు ఆ విషయం అనేవాడు రామేశం మెత్తబడినా, రాజేశ్వరి వస్తే అలా జరగనీయదు ఆమె గురించి నాకు చిన్నప్పట్నుంచీ తెలుసు తెలివైనది, మాటకారి అవసరమయితే ఎదిరించే గుణం తనది ! అన్నీ తల్లి బుద్ధులే !

* * *

రాజేశ్వరి కాపురానికొచ్చిన ఆరు నెలల్లో, అనూరాధ రెండుసార్లు వాళ్ళింటి కెళ్ళినా, తను మాత్రం మా గడప తొక్కలేదు రామేశం సరేసరి సోమేశం ఆరు నెలలకో, ఏడాదికో వస్తాడు

వాడికెంతసేపూ ట్యూషన్లు ఓవర్ టైములు డబ్బు సంపాదన తప్పితే వేరే ఆలోచన లేదు

పెద్దచెల్లెలు, బావగారూ అంతే !

ఎంతసేపూ నేను, అందరూ కావాలి

చూడాలని తాపత్రయపడటమే కాని, వారెవ్వరికీ ఎందుకుండదో ?

ఇలా వున్నాయి, మా అనుబంధాలు... ఏవిటో ?

మా యింటికొస్తే వారికి, మనిషికి మూడు రూపాయల ఖర్చు, గంట శ్రమ అవుతుందట ! మరి నెలకు నాలుగుసార్లు నేను వెడితే, ఎంతవుతుంది ?

*   *   *

మరో రెండు నెలల తరువాత —

అనూరాధ, నేను వాళ్ళింటికెళ్ళాం ! నాన్న, అమ్మ విడిగా ప్రక్క వాటాలో వుంటున్నారు. నాన్న నేనిచ్చిన, భగవద్గీత పారాయణం చేస్తున్నాడు. అమ్మ పెరట్లో ఏదో చెట్లు నాటుతోంది !

"నీ ముద్దుల కోడలు నిర్వాకం వాళ్ళకి చెప్పవే !" అన్నాడు నాన్న. పదిహేను రోజుల క్రిందట, రాజేశ్వరి వారిద్దరిని వేరే వుండమని చెప్పిందట... ఇంటి దస్తావేజులు హస్తగతం చేసుకొందిట... తనకు పెన్షను వస్తుంది కాబట్టి, బయటెక్కడైనా వుంటే అద్దె యివ్వాలి కనుక, వంద రూపాయలు అద్దెగా తన కివ్వాలిట... అలా యిష్టం లేకపోతే తనకింకా యిద్దరు కొడుకు లున్నారని గుర్తు చేసిందట !"

మరెన్నో సంఘటనలు ... మార్పులు ... జరిగాయి రాజేశ్వరి అటూ యిటూ తిరుగుతూ అన్నీ వింటూనే వుంది.

అమ్మ ఎంతో బాధపడుతూ చెప్పింది.

*   *   *

వో రోజు నాన్న ఆఫీసుకు వచ్చాడు. రామేశం, రాజేశ్వరిల ప్రవర్తన గురించి చెప్పసాగాడు.

ఇల్లు అమ్మేందుకు దస్తావేజులు యిమ్మంటే కేకలు, దీవాట్లు వేసిందట ... ఏరికోరి తెచ్చుకొన్న మేనకోడలు ఏకు మేకు అయి కూర్చుందిట ! రెండో కోడలు సరేసరి ! సోమేశం విషయం తెలిసిందేకదా ?

కొడుకులు కోడళ్ళు యిలా తయారయ్యేరని ఆయనెంతో బాధపడ్డాడు.

క్రితంరోజు రాజేశ్వరికి, అమ్మకు పెద్దగా పోట్లాట జరిగిందట. ఇద్దరిమధ్య మాటలు జోరుగానే పెరిగాయిట. తను ఏదో పనిమీద సికింద్రాబాదు వెళ్ళాడుట ... వో వందరూపాయ లిమ్మని అమ్మని అడగటంతో తగవు ఆరంభ మయిందట ... రాగానే తనతో చెప్తే, నాన్నకూడా ఆమెను మందలించాడుట.

"మేనకోడలువని నిన్ను వాడికి కట్నంలేకుండా చేసుకొన్నాను ... అంతేకాని నువ్వో అందగత్తెవని... వాడికింక పెళ్ళికాదనికాదు ... నా చెల్లెలు మొహం చూసి నిన్ను యింకా యింట్లో వుండనిస్తున్నాను. జాగ్రత్తగా వుంటేసరి ... లేకపోతే నీ యింటికి పోవల్సివుంటుంది ... " ఆయనలో ఆవేశం, కోపం తారాస్థాయికి చేరాయి.

"ఆ పని చేయవలసింది మీరేనని మరిచి పోతున్నారేమో ? ఈ యిల్లు నా భర్తది ... ఇక్కడ మీకేం అధికారం లేదు ... ఏదో మా అమ్మకు అన్నగారివి కాబట్టి యీ మాత్రమైనా మర్యాదగా మాట్లాడవలసి వచ్చింది ... ఎవరితో ఎలా మాట్లాడాలో నాకు బాగా తెలుసు !" రాజేశ్వరి గొంతులో స్వరం పెరిగింది. ఆమెలో ఏదో అహం... గర్వం గుర్తించారాయన.

నాన్న ఇంకేమీ మాట్లాడలేకపోయాడు. రాజేశ్వరితో వాదించటం వలన ప్రయోజనం లేదు రామేశం పెళ్ళాం కొంగుకే తాళి కట్టినట్టుగా, ఏమీ మాట్లాడలేకపోయాడు. ఆఖరివాడు, చిన్న ఉద్యోగస్థుడని స్థలం వాడి పేరున కొని, అరవై వేలతో యిల్లు కట్టించి యిచ్చిన పొరపాటు నాన్న గుర్తించాడు. సోమేశం పదివేలు రాబట్టేవరకూ సౌమ్యంగా ప్రవర్తించి, వెళ్ళిపోయాడు. ఎటూ సహాయం పొందనివాడు, ఏమీ మాటలు అనకుండా గౌరవంగా వుంటున్నది పెద్దాడు మాత్రమే !

ఏ ముఖం పెట్టుకొని వాడి దగ్గరకెళ్ళాలి ? చూస్తూ చూస్తూ వాళ్ళనిలా వదిలిపెట్టిపోవడానికి ఆయనకు మనసంగీకరించలేదు.

రాజేశ్వరి అన్నమాటలతో బాధతో అమ్మ వంట ప్రయత్నం చేయలేదు. జరిగిన విషయం పెద్దదే!

## యూకలిప్టస్ కార్లు !

జపానులోని కాన్పె ఎల్రక్టిక్ పవర్ కంపెనీ, సుజుకి మోటారు కంపెనీల వారు ఇటీవల ప్రయోగాత్మకంగా యూకలిప్టస్ అయిల్ ఇంధనంగా ఉపయోగించి కార్లను నడిపారు. ఈ యూకలిప్టస్ కార్లు గ్యాసోలిన్ కార్లను అధిగమించగలవని ఈ ప్రయోగాలలో తేలింది. ఇంజను వేగము, యాక్సిలిరేషన్లలో యూకలిప్టస్ కార్లు గ్యాసోలిన్ కార్లతో సమానంగానే వున్నప్పటికీ, ఇది నైట్రోజను ఆక్సైడును తక్కువ గా విడుదల చేస్తాయి. ఇంధనంగా యూకలిప్టస్ ఆయిల్ గ్యాసోలిన్ కంటే పది శాతం ఎక్కువ సామర్థ్యాన్ని కలిగి వుంటుందని ఈ పరీక్షల్లో తేలింది. గ్యాసోలిన్ కార్లను కొద్ది మార్పులతో యూకలిప్టస్ కార్లుగా మార్చవచ్చు. అయితే యూకలిప్టస్ ఆయిల్ ఖరీదును మాత్రం తగ్గించవలసి ఉంటుంది.

దాన్ని నాన్న ఓ సవాల్‌గా తీసుకొన్నాడు కాని ఆయన అంతకన్నా ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలోవున్నాడు.

మరో పదిరోజులు గడిచాయి.

*   *   *

తెల్లవారుఝామున పాలవాడి కాలింగ్ బెల్ శబ్దంతో నిద్ర చెదిరిపోయింది. అప్పటికే నాన్న లేచి కూర్చుని, గెడ్డంకింద చేయి పెట్టుకొని ఏదో ఆలోచిస్తున్నాడు. అమ్మలేవబోతోంది.

అనూరాధ లేచి చీర సవరించుకొంటోంది. పిల్లలిద్దరూ నిద్రపోతున్నారు. వారికింకా తాత, నాయనమ్మ వచ్చినట్లు తెలియదు.

అమ్మలేచి వాకిలి తుడిచి, కళ్ళాపుచల్లి, ముగ్గు పెడ్తోంది. అనూరాధ కాఫీ ప్రయత్నం చేస్తోంది.

మరో అరగంట తరువాత క్రితంరోజు జరిగిన దంతా చెప్పాడు నాన్న! సూట్‌కేసు తీసి అందులో నుంచి ఓ చెక్ తీసి నా చేతిలో వుంచాడు.

అది పదిహేనువేల రూపాయలకు రాసిన చెక్

"ఒరేయ్ ! పెద్దాడా, దీన్ని నీ దగ్గర వుంచరా ఇది పాపాయికి యిచ్చే బహుమతి. కాదనకు నీక్కూడా నామీద కోపంవుందా?" అన్నాడు.

ఆయన కంటిలో కన్నీటి తెర గమనించాను.

"మేమిద్దరం నీ దగ్గరే వుంటాం! మీరు పొమ్మన్నా ఎక్కడికీ వెళ్ళేదిలేదు... ఆ యింటితో మాకు ఋణం తీరిపోయింది..." ఇంకా ఏదో చెప్ప బోతుంటే అనూరాధ కాఫీ తెచ్చిపెట్టింది.

మరికొంచెంసేపు రామేశం, రాజేశ్వరిలగురించి చెప్పాడు.

ఆయన కళ్ళల్లోను, మాటల్లోను—విచారం పశ్చాత్తాపం ! అమ్మలో కూడా మార్పు కనబడింది నాకేం మాట్లాడేందుకు తోచలేదు.

"చిన్నవాళ్ళు ... వాళ్ళేదో తెలివితక్కువగా ప్రవర్తించేరని మీరు సీరియస్ అయిపోతే ఎలా చెప్పండి ! వాళ్ళని మీరు క్షమించాలి" అన్నాను, అంతకన్నా ఏం మాట్లాడాలో తెలియక.

"చిన్నవాళ్ళు అయితే జాగ్రత్తగా మాట్లాడాలి. పెద్దవాళ్ళు అన్న గౌరవం వుండాలి...ఆ రామేశం గాడికేం రోగం !...పెళ్ళాన్ని సమర్థిస్తూ మాట్లాడతాడా ! పెళ్ళయ్యేవరకు అమ్మ, నాన్న చుట్టూరా తిరిగి, ఆవిడ రాగానే ఆ కొంగుకింద దూరుతాడా? వెధవ ! కనిపెంచిన తల్లిదండ్రులకంటే ఈరోజు వచ్చిన పెళ్ళాం ఎక్కువయిందా ?" ఆయన యింకా మాట్లాడబోతుంటే, మరో టాపిక్‌లోకి దింపాను.

నేను వెళ్ళి రామేశాన్ని, రాజేశ్వరిని మందలించా లనుకొన్నాను. రాజేశ్వరిని చిన్నతనంనుంచి నేను ఎరుగుదును... ఎందుకో, తను నా మాట వింటుం దనే నమ్మకం నాకు ఏర్పడింది... అయినా పెద్దవాళ్ళ పెద్దరికాన్నే తోసిపారేసేక, నన్ను ఏమని లెక్క చేస్తారు ?

నాకు జన్మనిచ్చి, పెంచి, పెద్దజేసిన నాన్న — అమ్మ నాకేం బరువు ? వారిని చూడవలసిన కనీస బాధ్యత నాకుంది. ఒకరితో నాకేం పని ? వారి పోషణకు నేనెటువంటి ప్రతిఫలం ఆశించకూడదు.

ఎవరో సినీ కవి అన్నట్లు "అనుబంధం, ఆత్మీయత అంతా ఒక బూటకం" అట ! నిజమే నేమో ! ఈ రోజుల్లో అన్న, తమ్ముడు, చెల్లెలు, తల్లి, తండ్రి అన్నవేవీ లేవు... అంతా డబ్బు, స్వార్థంతో నిండిపోయింది. రక్తసంబంధాలు, గౌరవాభిమానాలు అన్నీ డబ్బుకు దాసోహం అవుతున్నాయి.

రామేశం, రాజేశ్వరి, సోమేశం నాకు పరాయి వాళ్ళు కాదు. వారు నన్ను ఆ విధంగా భావించినా, నాకా దృష్టి లేదు. వాళ్ళు తప్పచేస్తే, దండించి సరిదిద్దవలసిన బాధ్యత నాకుంది.

ఇంతలో నా రెండో కూతురు "డంకూ దమ్మైకా" (అది దాని ముద్దుపేరు) లేచి తాతగారిని ప్రహరిగోడ దగ్గరకు తీసుకెళ్ళి, వారం రోజుల క్రితం ఆ గోడకు తగిలించబడిన పాలరాతి "నేం ప్లేటు" చూపించింది.

దానిమీద నాన్న పేరు వ్రాయబడినది !

ఆయన ఎంతో సంతోషించడం, కన్నీటిని అద్దుకోవడం నేను గమనించాను. ★